సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ప్రసాదం.. అమోఘం..

స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో తయారు చేస్తున్న గోధుమ నూక ప్రసాదానికి గొప్ప గౌరవం లభించింది.

12లో



కొనసాగుతున్న రైళ్ల రద్దు

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రైళ్లు రద్దు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు మంగళవారం కూడా ఆగిపోయాయి.

12లో

సామూషిక పోరు

వరి రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఎలుకల బెడద ముఖ్యమైంది. వీటి కారణంగా పంట దిగుబడి భారీగా దెబ్బతింటోంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి.



న్యూస్‌రీల్

870 ఎకరాల్లో పంట మునక



నగరంలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

మామిడికుదురు: భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 870 ఎకరాల వరిపంట ముంపు బారిన పడిందని జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.బోసుబాబు అన్నారు. నగరం గ్రామంలో ముంపునకు గురైన పొలాలను శాస్త్రవేత్తల బృందంతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. డాట్ సీనియర్ శాస్త్రవేత్త నంద కిశోర్, ఏరువాక కేంద్రం పీడీ వై.జ్యోతిర్మయి, ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, ఏఓ జె.మనోహర్ తదితరులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముంపు నీరు దిగిన తర్వాత 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాషియం వేసుకోవాలని, తెగుళ్లను అరికట్టేందుకు కార్బండిజం, మాంకోజెబ్ 20 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మునిగిన పొలాల్లో ఒక ఎకరానికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, లీటర్ నీటికి కలిపి చల్లుకోవాలని సూచించారు. డీఏఓ బోసుబాబు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 24 వరకు జరిగే ఈ – పంట నమోదును త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ బి.మృదుల పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

అంబాజీపేట: రైతులకు అవసరమైన ఎరువులను ఆయా గ్రామాల్లోని సొసైటీల ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. చిరతపూడిలోని రైతు సేవా కేంద్రాన్ని, ఈ–పంట నమోదులో ఈ–కేవైసీ ప్రక్రియను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ–పంట నమోదు ఈ నెల 15 వరకూ చేస్తారని, రైతులు త్వరితగతిన ఈ–కేవైసీ, పంట నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ కోసం రైతుల జాబితాను ఉంచుతామన్నారు. అంతకు ముందు రైతు సేవా కేంద్రం, సొసైటీలోని ఎరువుల గోడౌన్, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్, ఏఈఓ డి.దుర్గారావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, వీహెచ్‌ఏ ఎం.రవితేజ ఉన్నారు.

విజయవాడకు పులిహోర, వాటర్ ప్యాకెట్ల తరలింపు

అన్నవరం: అన్నవరం సత్యదేవుని అన్నదాన విభాగంలో తయారు చేసిన పది వేల పులిహోర ప్యాకెట్లు, 42 వేల తాగునీటి ప్యాకెట్లను అధికారులు మంగళవారం విజయవాడ పంపించారు. ఇందుకోసం తరలివెళ్తున్న బస్సుకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ జెండా ఊపి ప్రారంభించారు. వీటితో బాటు తుని మండలం లోవ దేవస్థానంలో, కోట సత్తెమ్మతల్లి దేవస్థానంలో తయారు చేసిన 20 వేల పులిహోర ప్యాకెట్లను కూడా విజయవాడ పంపించినట్లు అధికారులు తెలిపారు. వీటిని విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో అందజేసినట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన గోదావడి



మామిడికుదురు మండలం పాశర్లపూడి బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహం

- పెరిగి, తగ్గిన వరద
- నదీపాయల్లో ప్రవాహ ఉధృతి

సాక్షి, అమలాపురం: గోదావరికి వేగంగా వచ్చిన వరద..అంతే వేగంగా తగ్గిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో కురిసిన వర్షాలకు గోదావరిలో వరద నీరు పెరిగింది. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ (ఎస్‌ఏబీ) వద్ద సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో ఇన్‌ఫ్లో 5,10,322 క్యూసెక్కులుగా నమోదైంది. డెల్టాలోని మూడు ప్రధాన పంట కాలువలకు మూడు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, 5,08,943 క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు వదిలేశారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో వరద ఉరవడి తగ్గింది. 3,40,543 క్యూసెక్కుల వృథా జలాలను మాత్రమే కిందకు వదిలారు. సోమవారం ఉదయం కనిపించిన గోదావరి వరద ప్రభావం దిగువన కోనసీమ జిల్లాలోని గోదావరి నదీపాయల్లో కనిపించింది. పి.గన్నవరంలో పాత అక్విడెక్టును తాకుతూ వరద నీరు ప్రవహించింది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయిలంక కాజ్ వే మీదకు నీరు చేరింది. దీనిలో లంకవాసులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. బ్యారేజీ వద్ద సాయంత్రం నుంచి వరద తగ్గడంతో మంగళవారం ఉదయం కాజ్‌వే ముంపు నుంచి బయటపడింది. **గోదావరి వరద మంగళవారం ఉదయం నాటికి పూర్తిస్థాయిలో తగ్గింది. బ్యారేజీ నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో 3,05,043 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదిలారు.**

ఆగస్టులో వరద లేదు

గోదావరికి సాధారణంగా ఆగస్టులో భారీ వరదలు వస్తుంటాయి. 1986లో రికార్డు స్థాయిలో వచ్చిన వరదతో పాటు పలు సందర్భాలలో గోదావరికి ఆగస్టులో వరద రావడం సర్వసాధారణం. కానీ ఈ సారి జూలై నెలాఖరు సమయంలో వరద వచ్చింది. రెండుసార్లు వరద పెరిగి తగ్గింది. కానీ ఈ ఆగస్టులో మాత్రం ఆ ప్రభావం లేదు. గత 28వ తేదీ జూలైన 16.14 లక్షల గరిష్ట వరద నమోదైంది. తరువాత క్రమేపీ తగ్గుతూ వచ్చి ఆగస్టు ఒకటో తేదీకి 10.33 లక్షల క్యూసెక్కులకు చేరింది. తరువాత మరింత వేగంగా గోదావరి వరద తగ్గింది. రెండో వారం నుంచి వరద సాధారణ స్థితికి వచ్చింది. అప్పటి నుంచి నెలాఖరు వరకు గోదావరిలో రోజుకు సగటున 2.20 లక్షల క్యూసెక్కుల వరద మాత్రమే కొనసాగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఆగస్టులో ఇన్‌ఫ్లో చాలా తక్కువ అని చెప్పాలి. 2022లో గోదావరికి జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరద రావడం గమనార్హం.

వరద పెరిగే అవకాశం

పి.గన్నవరం: ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీనదీ పాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో నదీ పాయల్లో క్రమేపీ నీరు పెరుగుతోంది. భద్రాచలం వద్ద మంగళవారం రాత్రి 7 గంటలకు 36.6 అడుగులకు నీటిమట్టం చేరింది. బుధవారం ఉదయం మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని అంచనా. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిలంక, బూరుగులంక గ్రామాల ప్రజలు వరద ఉధృతితో పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

వరద భయం

మామిడికుదురు: గోదావరి వరద తీర గ్రామాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతుందన్న హెచ్చరికలు లంక గ్రామాల ప్రజలను కలవర పెడుతున్నాయి. అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి స్నానఘట్టంతో పాటు పాశర్లపూడి బాడవ వైనతేయ వారధి వద్ద మంగళవారం నది ఉధృతంగా ప్రవహించింది. జూలైలో వచ్చిన వరదతో తీర గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మళ్లీ నెల రోజుల వ్యవధిలో వరద పెరుగుతుందన్న సమాచారంతో కంగారు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న కాజ్‌వేకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఈ కాజ్‌వే మునిగిపోతే అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రోడ్డు రవాణా స్తంభించిపోతుంది. ఆ మూడు గ్రామాల ప్రజలు వరద నీటిలో రాకపోకలు సాగించాల్సిందే.



బూరుగులంక రేవులో పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు



పి.గన్నవరం పాత అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

గణపతి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

అమలాపురం రూరల్: అధికారులు సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గణపతి మంటపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కోసం జిల్లాలోని ఘాట్ల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా, ప్రశాంతంగా పండగను జరుపుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. మట్టితో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలను, ఉత్సవ కమిటీలను చైతన్యపర్చాలన్నారు. ఘాట్ల వద్ద తాగునీరు, బారికేడింగ్, హైడ్రాలిక్ క్రేన్లు, ఎల్‌ఈడీ లైటింగ్, ఫ్లడ్ లైట్లు, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం, స్టేజీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి విగ్రహాలు తరలించే మార్గాల్లో విద్యుత్ తీగలు అడ్డు రాకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తం కావాలన్నారు.

ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల వివరాలు అందజేయాలి

అమలాపురం రూరల్: ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలలోని మౌలిక వసతుల వివరాలను సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు, సముద్రంలోకి వేటకు వెళ్లేటప్పుడు బాహ్య ప్రపంచంతో ఎలా సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరా తీశారు. భైరవపాలెం, బలుసుతిప్ప, కొత్తపాలెం, ఓడలరేవు, వాసాల తిప్ప, అంతర్వేదిపాలెం, కరవాకలోని ఫిష్ లాండింగ్ కేంద్రాలలో జెట్టీలు, వేలంపాట హాలు, వల మరమ్మత్తులు చేసుకునే హాళ్ల, చేపల స్టోరేజీ గదులు లాంటి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నుంచి చేపలను ఏ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు, జిల్లాలో ఉన్న ఫిష్ ప్రాసెసింగ్ కేంద్రాల వివరాలను సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, ఏడీలు, ఎఫ్‌డీఓలు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొబ్బరి పరిశోధనా కేంద్రం సేవలు భేష్



అంబాజీపేట పరిశోధనా కేంద్రంలో బదనికలపై ఆరా తీస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం ద్వారా రైతులకు అందుతున్న సేవలు బాగున్నాయని కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ అన్నారు. అంబాజీపేటలోని పరిశోధనా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావుతో చర్చించి కేంద్రం ప్రగతిని తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలు, కేంద్ర విస్తీర్ణం, విడుదల చేసిన కొబ్బరిలో ఉత్పత్తి రకాలు, హైబ్రిడ్ కొబ్బరి మొక్కల ఉత్పత్తి, రైతుల నుంచి ఉన్న డిమాండ్ తదితర వాటిని కలెక్టర్ తెలుసుకున్నారు.

గంగ, హైబ్రిడ్ కొబ్బరి మొక్కలకు డిమాండ్

డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ పరిశోధనా కేంద్రం నుంచి విడుదల చేసే గోదావరి గంగ, హైబ్రిడ్ కొబ్బరి మొక్కల రకానికి డిమాండ్ ఉందని, సాలుకు 25 వేల కొబ్బరి మొక్కలను ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. కీటక విభాగ ప్రయోగశాలలో తెల్లదోమ నివారణకు జరుగుతున్న పరిశోధనలను, పేథాలజీ ప్రయోగశాలలో వివిధ రకాల తెగుళ్లపై జరుగుతున్న పరిశోధనలను వివరించారు. కొబ్బరిపై ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు ప్రయోగశాలల్లో ఉత్పత్తి చేస్తున్న జీవ నియంత్రణ కారకాలను (బయో కంట్రోల్ ఏజెంట్లు) ఉత్పత్తి చేసే పద్ధతులను వివరించారు. నల్ల ముట్టె పురుగు, తెల్ల దోమ, ఆకుతేలు నివారణకు ఉపయోగించే బదనికలను ఉత్పత్తి చేసే పద్ధతులను తెలిపారు. కొబ్బరి తోటలలో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో వివరాలను, తయారీ విధానం, సస్యరక్షణ చర్యలు, మార్కెటింగ్, తదితర విషయాలను తెలిపారు.శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, వి.అనూష, ఎ.కిరీటి, బి.నీరజ, తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీర రాఘవులు, సీఈఓ ఏ.గోపాలకృష్ణ, అభ్యుదయ రైతు సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు.

కోయకుండానే కన్నీరు

- పెరుగుతున్న ఉల్లిపాయల ధర
- వర్షాలకు మరింత ఎక్కువయ్యే అవకాశం
- మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.60కి విక్రయం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

అమలాపురం టౌన్: గతంలో ఉల్లిపాయలను కోస్తుంటే కన్నీరు వచ్చేది. ఇప్పుడు కొనాలంటేనే ఆ పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే పెరిగిన ఉల్లిపాయల ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాటి ధర మరింత పెరగనుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.60 పలుకుతోంది. నాలుగైదు రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని కూరగాయల దుకాణదారులు చెబుతున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకూ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాకు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. లోకల్ పంట అంటే మన రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో పండే పంట. సాధారణంగా లోకల్ పంట దిగుబడులు అందుకోగానే కొండెక్కిన ధరలు కొంత తగ్గుతాయి. అయితే రాష్ట్రంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోకల్ పంట అలా ఉంచి, మహారాష్ట్ర నుంచి వచ్చే దిగుమతులకు కూడా అవరోధం కలిగేలా ఉంది. ఈ నేపథ్యంలో ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగి, ధర ఎక్కువయ్యే అవకాశం ఉంది.

జిల్లాలో సుమారు 660 దుకాణాలు

జిల్లాలో 110 వరకూ పెద్ద, 550కి పైగా సాధారణ స్థాయి కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వీటికి నిత్యం సుమారు 250 నుంచి 300 టన్నుల ఉల్లి దిగుమతి అవుతుంది. హోల్‌సేల్ పాయింట్ల నుంచి రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి కూరగాయల దుకాణాలకు తెచ్చుకుని విక్రయిస్తుంటారు. అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, రావులపాలెం, కొత్తపేట, రాజోలు, మలికిపురంలోని హోల్‌సేల్ దుకాణాలకు మహారాష్ట్ర నుంచి లారీల్లో ఉల్లి దిగుమతి అవుతుంది. లోకల్ పంట అయిన కర్నూలు జిల్లా ఉల్లి ఈపాటికే జిల్లాకు దిగుమతి అయ్యేది. అయితే వర్షాల కారణంగా కొంత ఆలస్యమవుతుంది. వచ్చే వారానికి లోకల్ పంట అందుకుంటుందని కూరగాయల వ్యాపారులు అంచనా వేసినప్పటికీ వర్షాల కారణంగా పది నుంచి పదిహేను రోజులు పట్టవచ్చని అంటున్నారు. అప్పటి దాకా మహారాష్ట్ర నుంచి దిగుమతి అయ్యే ఉల్లిపైనే ఆధార పడాల్సి వస్తుంది.

జాబు ఇదేనా బాబూ!

- నూతన మద్యం పాలసీ సరే.. ఉద్యోగుల మాటేంటి?
- కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలంటున్న ఉద్యోగులు
- సెప్టెంబర్ ఏడు నుంచి నిరసన బాట

ఆలమూరు: బాబు వస్తే జాబు వస్తుంది.. అంటూ గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తుంది. మద్యం అమ్మకాల్లో కొత్త పాలసీని తీసుకువస్తామంటూ పాత విధానానికి స్వస్తి పలుకుతున్నామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో మద్యం కొత్త పాలసీ అమల్లోకి రావడం ఖరారైన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందిని తొలగిస్తారా? లేక కొనసాగిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోని 2019లో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికై జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకుని వివిధ హోదాల్లో మద్యం దుకాణాల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానం రూపకల్పనకు ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ మద్యం దుకాణాల బదులు వేలం ద్వారా ప్రైవేట్ వ్యాపారులకు నిర్వహణ అప్పగించేందుకు నిర్ణయించుకుంది. దీనికి తోడు ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలసరి జీతభత్యాలు సకాలంలో ఇవ్వకపోవడంతో పాటు పీఎఫ్, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలను ఉపసంహరించుకునే దిశగా చర్యలకు ఉపక్రమించడంతో ఉద్యోగుల్లో అప్పుడే భయాందోళనలు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధిని కల్పించి జీవనోపాధిని కల్పించింది. వైఎస్సార్ సీపీ పాలనలో గత ఐదేళ్లలో ఎటువంటి సమస్యలు లేకుండా ఆ ఉద్యోగుల కుటుంబాలకు ఆసరాగా నిలిచింది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులనే కొనసాగించాలి

నూతన మద్యం పాలసీ విధానంలో కూడా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపికైన ఉద్యోగులను కొనసాగించాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పాశల రామచంద్రరావు కోరారు. ఉద్యోగం ద్వారానే జీవనోపాధి పొందుతున్న తమకు ప్రభుత్వం సరైన న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. ఉద్యోగుల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించే విధంగా ఈనెల ఏడు లోగా ఉద్యోగుల కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరవధిక సమ్మెబాట తప్పదని హెచ్చరించారు.

కొత్త పాలసీకి వ్యతిరేకం కాదు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదలచుకున్న కొత్త పాలసీ (ప్రైవేట్ దుకాణాలు)కి వ్యతిరేకం కాదని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌సీసీఓఈడబ్ల్యూఏ) చెబుతోంది. ఔట్ సోర్సింగ్ విధానంలో తమను ఉద్యోగులుగా ఎంపిక చేసినందున కొత్త పాలసీ విధానంలోనూ అదే పద్ధతిలో కొనసాగించాలని ఇప్పటికే సీఎం నారా చంద్రబాబు నాయుడుకు లేఖల రూపంలో విజ్ఞాపనలు అందజేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అమలాపురం, రాజమహేంద్రవరం, సామర్లకోట మద్యం డిపోల పరిధిలో 407 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా అందులో 2009 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్కో మద్యం దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మన్‌లు, ఒక వాచ్‌మన్ ఉంటారు. మండల కేంద్రాలు, పట్టణాల్లోని మద్యం దుకాణాల్లో మాత్రం మరో సేల్స్‌మన్ అదనంగా ఉంటారు. సూపర్‌వైజర్‌కు రూ.19,500, సేల్స్‌మన్‌కు రూ.16,500, వాచ్‌మన్‌కు రూ.10 వేల జీతం ఇస్తున్నారు.



చింతలూరులో ప్రభుత్వ మద్యం దుకాణం

ప్రభుత్వం స్పందించకుంటే నిరసన బాటే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన మద్యం పాలసీ విధానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన ప్రకటన విడుదల కాకుంటే సెప్టెంబర్ ఏడు నుంచి నిరసన బాట పట్టేందుకు యూనియన్లు నిర్ణయించుకున్నాయి. ఈనెల నాలుగు నుంచి ఆరు వరకూ ఆయా మద్యం డిపోల పరిధిలోని ఉన్నతాధికారులకు వినతి పత్రాల ద్వారా డిమాండ్లు తెలియజేయాలని రాష్ట్ర యూనియన్ నుంచి ఆదేశాలు వెలువడినట్లు తెలుస్తోంది. అయితే తమపై ఆధారపడ్డ కుటుంబాలకు పెంచి పోషించుకునేందుకు విధిలేని పరిస్థితుల్లో ఈ నిరసన కార్యక్రమాలను చేపట్టవలసి వస్తుందని యూనియన్ నాయకులు ఆవేదన చెందుతున్నారు. గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తూ సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహిస్తున్న మద్యం దుకాణాల ఉద్యోగులపై కరుణ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రైవేటు వ్యాపారులకు దుకాణాలు ఇచ్చినా సరే తమనే ఉద్యోగులుగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం ఏ మేరకు, ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది.



మద్యం సీసాలు

జిల్లా	మద్యం దుకాణాలు	ఉద్యోగుల సంఖ్య
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	150	682
కాకినాడ	120	647
తూర్పు గోదావరి	137	680
మొత్తం	407	2009

ఉన్న పళంగా తీసేస్తే ఎలా?



కొత్త మద్యం పాలసీ అమలు చేస్తారో... పాత విధానాన్నే కొనసాగిస్తారో తెలీదు గాని... ఇప్పుడు అమలవుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న తమకు మాత్రం ఉద్యోగ భద్రత కల్పించాలి. మమ్మల్ని ఉన్న పళంగా తీసేస్తే మాతో పాటు మా కుటుంబాలు రోడ్డున పడిపోతాయి. ఉపాధి లేక ఊసూరుమంటాం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లుగా, సేల్స్‌మెన్లుగా, వాచ్‌మెన్లుగా వందలాది మంది అధికారికంగా పనిచేస్తున్నాం .ఇప్పుడు పాలసీ మార్పు పేరుతో మా పొట్ట కొట్టొద్దు. మమ్మల్ని కొనసాగించి మా జీవితాలకు న్యాయం చేయాలి.

– గుబ్బల దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్, ఇందుపల్లి ప్రభుత్వ మద్యం దుకాణం, అమలాపురం రూరల్ మండలం

ఏలేరులో 19.5 టీఎంసీల నీరు

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో రోజురోజుకు నీటి నిల్వలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో పడుతుండడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు గణనీయంగా పెరిగాయి. వర్షాలకు జలశయం పరివాహక ప్రాంతం నుంచి 4,991 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో నీటినిల్వలు పెరిగాయి. దీంతో ప్రాజెక్టులో మంగళవారం నాటికి 86.56 మీటర్లకు 84.20 మీటర్లు, 24.11 టీఎంసీలకు 19.50 టీఎంసీలకు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షపాతం ఎక్కువగా ఉండడంతో దిగువ ఆయకట్టు, పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

క్లుప్తంగా

క్షుద్రపూజల కలకలం



క్షుద్ర పూజలు జరిగినట్లుగా చూపిస్తున్న ఆనవాళ్లు

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఎదురుగా క్షుద్ర పూజలు జరిగినట్టు కలకలం రేగింది. ఆ ప్రాంతానికి చెందిన తంగెళ్ల సత్యనారాయణమూర్తి, మాణిక్యాలరావు అనే సోదరులు ఈ మేరకు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న తమ ఇంటికి సోమవారం రాత్రి ఎవరో క్షుద్ర పూజలు చేశారని ఫిర్యాదు చేశారు. పూజలు జరిగినట్టు ఉన్న ఆనవాళ్లను ఫొటోలు తీసి అందించారు. తమ ఇంటి చుట్టూ సూదులు గుచ్చిన నిమ్మకాయలు వేశారన్నారు. ఎర్ర రంగు నీళ్లు, పసుపు, కుంకుమ చల్లారని తెలిపారు. అక్కడే పగిలిన కోడిగుడ్లు కూడా లభించాయన్నారు. వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపారు.

వసతి గృహం పరిశీలన



హాస్టల్ భవనంలో గదిని పరిశీలిస్తున్న జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: స్థానిక జగన్నాథపురంలోని మహిళల బీసీ సంక్షేమ వసతి గృహాన్ని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె ఈ మేరకు తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థినులకు అందుతున్న వసతులు, సదుపాయాలను పరిశీలించారు. అక్కడి విద్యార్థులు మాట్లాడుతూ వసతి గృహంలో శ్లాబు రాళ్ల పెచ్చులు ఊడిపడుతున్నాయని, లైటింగ్ సరిగ్గా లేదని, ప్రహరీ సరిగ్గా లేకపోవడంతో బయట వ్యక్తులు వచ్చి, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

కొత్తపల్లి: విద్యుదాఘాతంతో తాటికిల్లు దగ్ధమైంది. మండలంలోని శ్రీరామపురం పంచాయతీ రామరాఘపురంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గల్లా అప్పారావుకు చెందిన తాటాకింట్లో విద్యుదాఘాతం కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంటిలోని గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం జరిగినట్టు అంచనా వేశామని అగ్నిమాపక సీఐ డి.రామకృష్ణంరాజు తెలిపారు.

సామూషిక పోరు

- వరిపంటను వేధిస్తున్న ఎలుకల సమస్య
- దిగుబడిపై అధిక ప్రభావం
- అన్నదాతల అవస్థలు
- సామూహిక చర్యలే మేలు అంటున్న వ్యవసాయాధికారులు





వరి పంటను కొరుకుతున్న ఎలుక

కొత్తపేట: వరి రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఎలుకల బెడద ముఖ్యమైంది. వీటి కారణంగా పంట దిగుబడి భారీగా దెబ్బతింటోంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. ఖరీఫ్ (తొలకరి) సీజన్‌లో ఆకుమడి దశ నుంచి కుప్పల వరకు ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. పంట వేసినప్పటి నుంచి చేతికి వచ్చే వరకూ ఈ సమస్య వెంటాడుతూనే ఉంటోంది. ఎలుకలను సమర్థంగా అరికట్టాలంటే రైతులందరూ సామూహిక నిర్మూలన చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరితో పాటు ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, కూరగాయల తోటలకు కూడా ఎలుకల బెడద తప్పడం లేదు. ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటిమట్టానికి ఆరు సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికివేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువ.

గుర్తించే విధానం

ఎలుకల సంచారాన్ని ఎప్పటికప్పుడు గమనించడం చాలా అవసరం. ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణా చర్యలు

ముందుగా రైతులు తమ పొలం గట్లపై కలుపు మొక్కలను పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలిన్ అనే ఎరను ఉచితంగా సరఫరా చేస్తోంది. రైతులు ఈ ఎరను తెచ్చుకుని ఎలుకలను నివారించుకోవచ్చు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేసుకోవాలి. ఈ మందు సుమారు 50 ఎలుక బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే అవి తెరుచుకుని కనిపిస్తాయి. ఈ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. రెండో విధానంలో వేటగాళ్లతో బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చు. అయితే వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.60 వరకు తీసుకుంటారు. మరో విధానంలో బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.100 తీసుకుంటారు. పై రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడినవి కావడంతో రైతులందరూ బ్రొమోడయోలోన్ ఎర ద్వారా ఎలుకల నివారణ చేయడం మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఏ విధానంలో చేసినా సామూహికంగా చేపడితేనే ఎలుకలను సమర్థంగా అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

పొలంలో ఎరను పెట్టే విధానం

480 గ్రాముల బియ్యం నూకల్లో 10 గ్రాముల నూనె, 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందును కలిపి ఎరను తయారు చేయాలి. దానిని 10 నుంచి 15 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టాలి. హెక్టార్ విస్తీర్ణంలో గుర్తించిన సుమారు 35 బొరియల్లో పెట్టాలి. గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) ఆధ్వర్యంలో రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించాలి.

జిల్లాకు 776 కేజీల మందు

ప్రస్తుత తొలకరి సీజన్‌లో జిల్లాలో 1.93 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటను ఎలుకల బారి నుంచి రక్షించేందుకు వ్యవసాయశాఖ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని తలపెట్టింది. దీనిలో భాగంగా అమలాపురం, కొత్తపేట, పి.గన్నవరం, ముమ్మిడివరం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం వ్యవసాయ సబ్ డివిజన్లకు 776 కేజీల బ్రొమోడయోలిన్ మందు చేరింది. ఏడు సబ్ డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో 415 గ్రామాలకు వరి విస్తీర్ణాన్ని బట్టి మందును సరఫరా చేశారు.

సామూహికంగా చేపట్టాలి



సార్వా పంటకు ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుంది. ఎవరికి వారే ఎలుకలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందును బొరియల్లో పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. దీనిపై రైతులకు ప్రతి ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మందును ఉచితంగా అందిస్తున్నాం. ప్రస్తుత తొలకరి సీజన్‌లో ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రొమోడయోలిన్ మందు త్వరలోనే రైతు భరోసా కేంద్రాలకు వస్తుంది. గ్రామాల వారీగా వరి ఆయకట్ల ప్రకారం రైతులకు అందిస్తాం. ఈ నెల 4న సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని నిర్ణయించగా, వర్షాలు కురుస్తున్నందున వాయిదా వేశాం.

– ఎం.వెంకట రామారావు, ఏడీఏ, కొత్తపేట

వ్యాపార భాగస్వామిపై హత్యాయత్నం

పిఠాపురం: చిట్‌ఫండ్ కంపెనీ లావాదేవీల్లో నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఒక వ్యక్తి తన వ్యాపార భాగస్వామిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పిఠాపురంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురానికి చెందిన కొర్ర సత్యనారాయణ, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఎల్.భాస్కర్ చిట్‌ఫండ్ కంపెనీ నడుపుతున్నారు. అయితే ఇటీవల వీరిద్దరి మధ్య వ్యాపార లావాదేవీల్లో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం పిఠాపురంలో భాస్కర్‌కు కొర్ర సత్యనారాయణ ఎదురయ్యాడు. తనను పిఠాపురం బైపాస్ రోడ్డు వద్ద దింపాలని భాస్కర్ కోరడంతో సత్యనారాయణ తన మోటారు సైకిల్ ఎక్కించుకున్నాడు. పిఠాపురం బైపాస్ రోడ్డులో బండి ఆపాలని చెప్పిన భాస్కర్.. బండి ఆగిన వెంటనే ఒక్క సారిగా కత్తితో సత్యనారాయణపై దాడి చేశాడు. ఈ ఘటనలో సత్యనారాయణ గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు పరారయ్యాడు. సత్యనారాయణ స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రౌతులపూడి: రాజవరంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.8990, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రసాదం.. అమోఘం..



సత్యదేవుని గోధుమనూక ప్రసాదం



ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌తో ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్

- అన్నవరం ప్రసాదానికి గుర్తింపు
- నాణ్యతలో అత్యున్నత ప్రమాణాలు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందజేత

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో తయారు చేస్తున్న గోధుమ నూక ప్రసాదానికి గొప్ప గౌరవం లభించింది. నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉన్నందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంస్థ గుర్తింపు నిచ్చింది. ఈ మేరకు మంగళవారం దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ తరఫున కాకినాడ జేఎన్‌టీయూ కళాశాల స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ఎం.రమేష్ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ద్వారా దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ స్వామి వారి ప్రసాదం స్వచ్ఛత, నాణ్యతకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు.



గతంలో వచ్చిన సర్టిఫికెట్లు

కాగా.. ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ సర్టిఫికెట్ కాలపరిమితి 2026 జూలై వరకూ ఉంటుంది. ఆ తర్వాత ఆ సంస్థ నిర్ణయించిన రుసుము చెల్లిస్తే మళ్లీ ప్రసాదం నాణ్యత, రుచి, తయారీ హాలు వద్ద పరిశుభ్రతా ప్రమాణాలను పరిశీలించి సర్టిఫికెట్ రెన్యువల్ చేస్తారు.

గతంలో కూడా..

గతంలో కూడా సత్యదేవుని గోధుమ నూక ప్రసాదానికి ఐఎస్ఓ 9001:2015, ఐఎస్ఓ 22000: 2005 సర్టిఫికెట్లు లభించాయి. హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఐఎస్ఓ 9001:2015, ఐఎస్ఓ 22000: 2005 సర్టిఫికెట్లను 2019లో ప్రదానం చేసింది. వాటిని జారీ చేసే ముందు ఆ సంస్థ ప్రతినిధులు దేవస్థానానికి వచ్చారు. ప్రసాదం, ఇతర విభాగాలను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టుగా నిర్వహణ ఉందని నివేదిక సమర్పించారు.

ఏటా రూ.25 కోట్ల ఆదాయం

ప్రసాదాల విక్రయాల ద్వారా ఏటా దేవస్థానానికి రూ.25 కోట్ల ఆదాయం వస్తోంది. దేవస్థానం వార్షిక ఆదాయం రూ.176 కోట్లు కాగా, అందులో ప్రసాదం విక్రయాల ద్వారా దాదాపు 15 శాతం ఉంటుంది. గోధుమ నూక, పంచదార, యాలకులు, నెయ్యితో తయారు చేసే స్వామి వారి ప్రసాదానికి చాలా ప్రాముఖ్యత ఉంది. స్వామివారిని దర్శించుకోకున్నా ప్రసాదం కొనుగోలు చేసే అవకాశం ఉంది. రత్నగిరిపై ఉదయం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ, కొండ దిగువన తొలిపాంచా వద్ద, జాతీయ రహదారిపై గల ప్రసాదం విక్రయ శాలల్లో 24 గంటలూ ప్రసాదం విక్రయాలు జరుగుతున్నాయి. 150 గ్రాముల గోధుమ నూక ప్రసాదం ప్యాకెట్‌ను రూ.20కి విక్రయిస్తున్నారు. నిల్వ ఉండే బంగీ ప్రసాదం వంద గ్రాములు రూ.20కు అమ్ముతున్నారు.

ప్రతిభను ప్రోత్సహించడానికే పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థికి ప్యాడ్ అందజేస్తున్న ఎల్ఐసీ అధికారి సంధ్యారాణి

రాజమహేంద్రవరం రూరల్: చిన్నారులలోని ప్రతిభను ప్రోత్సమించడానికే బీమా వారోత్సవాల సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నామని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, పాటల పోటీలు, కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ విజేతలకు ఈ నెల 6వ తేదీన జరిగే ముగింపు వేడుకలలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. జీవిత బీమా వారోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలోని 55 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, ఇతర మేనేజర్లు ఏవీఎస్ఆర్కే ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎంవీఎస్ మూర్తి, గన్నెయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో కానరాని ప్రయాణికుల రద్దీ

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రైళ్లు రద్దు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు మంగళవారం కూడా ఆగిపోయాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్.. ప్రయాణికులు లేక వెలవెలబోయింది. జన్మభూమి, గోదావరి, విశాఖ, గరీబ్ రథ్, నాందేడ్, వందేభారత్, కాకినాడ–తిరుపతి, కోకనాడ ఎక్స్‌ప్రెస్‌లు నడవలేదు. పలు చోట్ల ట్రాక్‌లు దెబ్బతినడంతో మరికొన్ని రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కాగా.. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ కొనసాగుతోంది. ప్రయాణికులు రైళ్ల రాకపోకలు వివరాలు తెలుసుకునేందుకు 0883 2420541ను సంప్రదించాలి.

నేడు మరికొన్ని..

రాజమహేంద్రవరం మీదుగా నడిచే పలు రైళ్లను బుధవారం రద్దు చేశారు. షిర్డీ ఎక్స్‌ప్రెస్ (17206), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016), గరీబ్‌రథ్ (12740)ను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

ఘనంగా శ్రీపాద జయంతి మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామి

పిఠాపురం: ప్రముఖ దత్త పుణ్యక్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి పల్లకీ సేవ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో వందల మంది మరాఠీలు పాల్గొన్నారు. ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామికి సహస్ర చామంతి పూజలు నిర్వహించారు.

ఇద్దరిపై కేసు నమోదు

రౌతులపూడి: కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఎ.మల్లవరం గ్రామానికి చెందిన నాకిరెడ్డి శివ, అనిమిరెడ్డి తల్లిబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వారిద్దరూ కోటనందూరు పరిసర ప్రాంతాలలో కోళ్ల వ్యర్థాలను కొనుగోలు చేసి, రౌతులపూడి మండలం బంగారయ్యపేటలోని చేపల చెరువుకు చేపల ఆహారం కోసం తరలిస్తున్నారు. రౌతులపూడి ఏలేరు కాలువ వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 500 కిలోల కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

తాళ్లరేవు: నీలపల్లి కొత్త కాలనీలోని వ్యభిచారం గృహంపై మంగళవారం కోరంగి పోలీసులు దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు నీలపల్లి కొత్త కాలనీలోని ఒక ఇంట్లో సంగాడి పార్వతి కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తోంది. దీనిపై అందిన సమాచారంతో కాకినాడ రూరల్ సీఐ డి.చైతన్యకృష్ణ నేతృత్వంలో పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలు పార్వతితో పాటు ఒక యువతి, విటుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ చైతన్యకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఆ ప్రాంతంలోని స్థానికులు మాట్లాడుతూ కొంతకాలంగా కాలనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అర్ధరాత్రి వరకూ రహదారిపైనే మద్యం తాగడం, దుర్భాషలాడడం, గొడవలకు దిగడం, మద్యం సీసాలను పగలుకొట్టడం వంటివి చేస్తున్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం



కుత్తుం దుర్గాప్రసాద్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన తమ్ముడు తిరిగి రాలేదని రాజమహేంద్రవరంలోని మురళీకృష్ణా నగర్‌కు చెందిన చింత పద్మావతి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లాలాచెరువు స్వరూప్ నగర్‌కు చెందిన 39 ఏళ్ల కుత్తుం దుర్గాప్రసాద్ ఈ నెల ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే మధ్యాహ్నం 3, మళ్లీ రాత్రి 11 గంటల సమయంలో తనను వెతకవద్దంటూ సెల్‌కు మేసేజ్ పెట్టాడు. పద్మావతి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.ప్రియాకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న జెడ్పీ సర్వసభ్య సమావేశం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ప్రారంభం కానున్నాయి. జిల్లా పరిషత్ సీఈవో ఏ.శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఈ విషయాన్ని తెలిపారు. గౌరవ సభ్యులందరితో పాటు ఉమ్మడి జిల్లా అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

వర్షాలకు కూలిపోయిన తాటాకిల్లు

పిఠాపురం: వర్షాల కారణంగా గోడలు నాని పోయి గొల్లప్రోలులో తాటాకిల్లు కూలిపోయింది. స్థానిక 5వ వార్డుకు చెందిన తందూరి సత్యవతి తన తాటాకింట్లో ఒంటరిగా జీవిస్తోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఆమె ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. నిరాశ్రయురాలైన ఆమె తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

జాతీయ ప్రమాణాల వైద్య బృందం తనిఖీలు

రామచంద్రపురం: పట్టణంలోని ముచ్చుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల అంచనా వైద్య బృందం మంగళవారం పరిశీలించింది. ఆసుపత్రిలో మెరుగైన, నాణ్యమైన, సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారా అనే విషయాలను బృందంలోని సభ్యులు పరిశీలించారు. ఈ మేరకు డాక్టర్ దేవేంద్ర కుమార్ బిటోరియా, డాక్టర్ ఎస్.తులసి సోమవారం ఆసుపత్రి చేరుకున్నారు. రెండు రోజుల పాటు అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ కె.సునీత, వైద్యులు కృష్ణ హరీష్, హేమసుందర్ ఆధ్వర్యంలో 12 రకాల డిపార్ట్‌మెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బందికి సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ అంశాలపై కొన్ని సూచనలు చేస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

రాయవరం: మండలంలోని పసలపూడిలో రూ.1.43 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణాపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు విజిలెన్స్, సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు పసలపూడి వంతెన వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వ్యాన్‌లో తరలిస్తున్న 3,110 కేజీల బియ్యాన్ని గుర్తించారు. వాహనం, బియ్యాన్ని సీజ్ చేశారు. పసలపూడి గ్రామానికి చెందిన వాహన యజమాని నాగిరెడ్డి సీతారామయ్య, డ్రైవర్ బాబుపై రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఆలీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పి.బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాలతో వరిపంటపై తెగుళ్ల దాడి



శ్రీరంగపట్నంలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మధురపూడి: వర్షాలు, వరదల కారణంగా కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లోని వరిపంటను ఆకుముడత, మాగుడు తెగుళ్లు ఆశించాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను సందర్శించారు. వాటిని ఆశించిన తెగుళ్లను గుర్తించి, రైతులకు నివారణా చర్యలను వివరించారు. కోరుకొండ మండలం కోటికేశవరం, శ్రీరంగపట్నం గ్రామాల్లో స్వర్ణ, ఎంటీయూ 1318 రకాలను రైతులు సాగు చేశారన్నారు. ఆకుముడత తెగులు నివారణకు కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మాగుడు తెగులు నివారణ కోసం హెక్సాకోనాజోల్ 2.0 మిల్లీలీటర్ల మందు లేదా ప్రొపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి చల్లాలని సూచించారు. అలాగే 30 కిలోల పొటాష్‌తో పాటు, 20 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి, రైతులు పాల్గొన్నారు.